క్లుప్తంగా

పౌష్టికాహారంతో ఆరోగ్యం



కానూరుకు గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ శ్రీలక్ష్మి

పెరవలి: పౌష్టికాహారం తీసుకున్నప్పుడే బాలింతలు, గర్భిణులు, కిషోర్ బాలికలు పూర్తి ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలక్ష్మి అన్నారు. కానూరు సెక్టార్‌లోని నడుపల్లి, కానూరు గ్రామాలకు కలిపి బుధవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. కానూరు అంగన్‌వాడీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించే చిరుధాన్యాలు, ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. చిరు ధాన్యాల్లో పోషకాలు అధికంగా ఉంటాయని, ఆకుకూరల వలన రక్తహీనత తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో కానూరు సర్పంచ్ సీహెచ్ లక్ష్మి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు పరీక్ష మెటీరియల్



విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ అందజేసిన రిటైర్డు వార్డెన్ జయరాజు

కొవ్వూరు: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలోని పదో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు.రిటైర్డు వార్డెన్ పెనుమాక జయరాజు ఆర్థిక సాయంతో బుధవారం రాత్రి ఒక్కో విద్యార్థికి పరీక్ష ప్యాడ్, జామెట్రీ బాక్సు, స్కేలు, పెన్ను వంటివి అందజేశారు. వార్డెన్ ముప్పిడి రాజు సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీలకు పారిశుధ్య యంత్రాల అందజేత

ఉండ్రాజవరం: జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా మండలంలోని వివిధ పంచాయతీకు మూడేసి రకాల పనిముట్లను నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అందజేశారు. ఈ కార్యక్రమం బుధవారం ఉండ్రాజవరంలోని సుదీంద్రబాబు కల్యాణ మంటపంలో జరిగింది. దోమల వ్యాప్తి నివారణకు ఫాగింగ్ మెషీన్లు, ప్లాస్టిక్ వస్తువులను వేడి చేసి బూడిద చేసే ఇన్సినేటర్లను, టాయిలెట్లను శుభ్ర పరిచేందుకు హై ప్రెషర్ టాయిలెట్ క్లీనర్‌లను ఎమ్మెల్యే వివిధ పంచాయతీలకు అందజేశారు.

31 నుంచి రాజగోపాల స్వామి కల్యాణోత్సవాలు

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల గ్రామంలోని రుక్మిణి సత్యభామ సమేత రాజగోపాలస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఈనెల 31 నుంచి ఏప్రిల్ 5 వరకూ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఏప్రిల్ 1 రాత్రి 8.30 గంటలకు స్వామివారి కల్యాణంతో పాటు భారీ అన్నసమారాధన జరుగుతుందన్నారు.

నవమి వేడుకలకు ఆలయాల ముస్తాబు

చాగల్లు: శ్రీరామ నవమి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. మండలంలోని నెలటూరు సీతారామస్వామి ఆలయంలోను, చాగల్లు మెయిన్ రోడ్డులోని సీతారామాలయంలోను నవమి ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. బ్రాహ్మణగూడెం రామాలయంలోను, ఎస్.ముప్పవరం, ఊనగట్ల, చిక్కాల తదితర గ్రామాల రామాలయాల్లో గురువారం నిర్వహించే సీతారామ కల్యాణానికి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

గోపాలపురం: స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయ 21వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబాకు కాకడ హారతి, అర్చన, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుడు పోతుల అప్పిరెడ్డి దంపతులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా గురువారం ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ గౌరవాధ్యక్షుడు కూనం రామమోహన్‌రెడ్డి చెప్పారు. ఆలయ ప్రధానార్చకుడు కె. సూర్యనారాయణ, కమిటీ సభ్యులు పోకల జగదీశ్వరరావు, సత్తి శ్రీనివాస్, టీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీపై చర్య చారిత్రక తప్పిదం

పెరవలి: కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చరిత్రాత్మక తప్పు చేసిందని డీసీసీ జిల్లా కార్యదర్శి పెచ్చెట్టి కోటేశ్వరరావు విమర్శించారు. బీజేపీ ప్రభుత్వ చర్యను నిరసిస్తూ పెరవలి మండలం అజ్జరంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పెరవలి మండల అధ్యక్షుడు బూదల లక్ష్మణరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధితో ఉద్యానానికి ఊతం

- కూలీలతో తోట పనులు
- కూలీలకు ఏప్రిల్ నుంచి రూ.15 చొప్పున వేతనం పెంపు
- మండలంలో రూ.12.కోట్లతో పనులు పూర్తి



ఆయిల్‌పామ్ తోటలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

నల్లజర్ల: ఉపాధి హామీ పథకం రైతులకు కూడా అండగా నిలుస్తోంది. తమ పొలాల్లో ఉద్యాన పంటల సాగులో ఉపాధి కూలీల సేవలను వారు వినియోగించుకుంటున్నారు. మరోవైపు గ్రామాల్లో పనులు లేనపుడు ఉపాధి హామీ పథకం కూలీలను ఆదుకుంటోంది. రబీ సీజన్‌లో కూలీలు వరి, ఇతర వ్యవసాయ పనులకు వెళుతూ, ఖాళీ సమయాల్లో ఉపాధి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. నల్లజర్ల మండలానికి 2021-22లో 3.49 లక్షల పనిదినాలను కల్పించారు. ఇక 2022-23లో 4.10 లక్షల పనిదినాలు కల్పించగా ఇప్పటికే పూర్తి చేశారు. అదనంగా మరో 30 వేల పనిదినాలను చేయవలసి ఉంది. ఇందుకోసం ఉపాధి కూలీలకు రూ.7 కోట్లు వేతనాల రూపంలో అందించారు. ఇక మెటీరియల్ కాంపొనెంట్‌గా రూ.4.62 కోట్లు వెచ్చించామని ఉపాధి హామీ ఏపీఓ సత్యనారాయణ చెప్పారు. ఉద్యాన సాగులో మొక్కల అభివృద్ధి, పంటబోదెల తవ్వకం, చెరువుల పూడిక తీత, పుంతరోడ్ల అభివృద్ధి వంటి పనులు చేపట్టారు.1102 కుటుంబాల వారు 100 రోజుల పని పూర్తిచేశారన్నారు.

2023-24 సంవత్సరంలో..

ఉపాధి హామీ పని ప్రదేశం నుంచి ఎన్ఎంఎంఎస్ ద్వారా కూలీల హాజరును ఫీల్డ్ అసిస్టెంట్ గాని, మేట్‌గాని విధిగా ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. అప్పుడే కూలీలకు వేతనం చెల్లిస్తారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు, ఏపీఓ, ఎంపీడీఓ, పీడీల పనితీరును కూడా సమీక్షించనున్నారు. వీరందరూ తమ పని తీరును ఆన్‌లైన్‌లో పొందుపరచాలి. కూలీలకు ఏప్రిల్-1 నుంచి రోజుకు రూ.15 చొప్పున వేసవి అదనపు అలవెన్సుగా అందించనున్నారు. గతంలో ఇచ్చే రూ.257 రోజువారీ వేతనానికి అదనంగా ఇచ్చే రూ.15తో వారి మొత్తం వేతనం రూ.272 కానుంది.

126 శాతం ఉపాధి పనులు



ఈ ఏడాది మండలంలో లక్ష్యానికి మించి ఉపాధి పనులు చేశాం. నూటికి 126 శాతం పనులను పూర్తి చేశాం. ఈ ఏడాది 4.10 లక్షల పనిదినాలకు గాను అదనంగా మరో 30 వేల పనిదినాలు ఈ నెలాఖరుకు పూర్తిచేయనున్నాం. కొత్త నిబంధనలతో రైతులకు మేలు జరగనున్నది. ఉద్యాన సాగులో ఉపాధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

– సత్యనారాయణ, ఉపాధి ఏపీవో, నల్లజర్ల మండలం

ముగిసిన గురుచరిత్ర సప్తాహ మహాయజ్ఞం



పూర్ణాహుతిలో పాల్గొన్న సుందరస్వామి

నల్లజర్ల: విశ్వశాంతి పరిరక్షణ, లోక కల్యాణార్థం దూబచర్లలోని దత్తసాయి పంచావతార మహాపీఠంలో నిర్వహిస్తున్న సప్త,సప్తాహ శ్లోకరూప గురుచరిత్ర సప్తాహ మహాయజ్ఞం బుధవారంతో ముగిసింది. మధురపూడి పీఠాధిపతి సుందరస్వామి ఆధ్వర్యంలో పూర్ణాహుతి జరిగింది. వల్లభాపురం మాతాజీ నిరంజనానంద, వేగి సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో 75 మంది దంపతులు పూజాదికాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అన్న సమారాధన జరిగింది.

సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరు మీదుగానే..



ఉండ్రాజవరంలో ఆసరా పథకం నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయిడు



ద్వారకాతిరుమలలో డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు అందజేత

ఉండ్రాజవరం: సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరు మీదుగానే మంజూరు చేయడమే గాకుండా, వారి ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత నమూనా చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఉండ్రాజవరంలోని సుదీంద్రబాబు కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసరా సొమ్ముతో వివిధ వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని, వచ్చే ఆదాయంతో కుటుంబాలను పోషించుకోవాలన్నారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్న జగనన్నను రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా అందరం కలసి పనిచేయాలన్నారు. ముందుగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మండలంలోని 12,080 మంది డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.11.37 కోట్ల విలువైన నమూనా చెక్కును ఆవిష్కరించారు. అనంతరం మండలంలోని డ్వాక్రా మహిళలు సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, వైస్ ఎంపీపీలు ఎస్.సరోజ, నవీన్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కాలాబత్తుల సుజాత, మండల సమాఖ్య అధ్యక్షురాలు పాలంగి లక్ష్మి, మండల గృహ సారథులు కన్వీనర్ కఠారి సిద్ధార్థరాజు, ఎంపీడీఓ ఎ.శ్రీనివాసు, ఏపీఎం రత్నకుమార్, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలలో..

ద్వారకాతిరుమల: మహిళల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ద్వారకాతిరుమలలోని వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం హైస్కూల్ మైదానంలో బుధవారం జరిగిన వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలంలోని 1,524 స్వయం స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ. 16.09 కోట్ల మెగా చెక్కును ఎమ్మెల్యే తలారి అందజేశారు. ఆ తరువాత లబ్ధిదారులతో కలసి సీఎం చిత్ర పటానికి ఆయన పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, బొండాడ వెంకన్నబాబు, గోపాలపురం నియోజకవర్గ పార్టీ మహిళా అధ్యక్షురాలు గారపాటి రమాదేవి, మండల అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, ఎంపీడీవో ఏవీ సుబ్బారాయన్, ఏపీఎం ఎం.అరవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ పనులు పూర్తి చేయండి

- ఎంపీపీ బంక జయలక్ష్మి
- పనుల పురోగతిపై మండల స్థాయిలో సమీక్ష



గడప గడపకూ పనులపై సమీక్షిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి, ఇతర అధికారులు

నల్లజర్ల: నల్లజర్ల పంచాయతీ మినహా మండలంలో మిగిలిన అన్ని గ్రామాల్లోనూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయింది. ఈ క్రమంలో ఆయా గ్రామాల ప్రజల నుంచి వచ్చిన వినతుల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీపీ బంక జయలక్ష్మి కోరారు. గడప గడపకూ పనులపై ఎంపీపీ జయలక్ష్మి అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గుర్తించిన పనులన్నీ త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల వారీగా పనులపై సమీక్షించి, ఇప్పటికీ పరిష్కారం కాని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులకు నివేదించారు. సొసైటీ అధ్యక్షులు కారుంచి రమేష్,పెండ్యాల హరేరామకృష్ణ , ఎంపీడీఓ జోగేశ్వరరావు, తహసీల్దార్ కిశోర్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు ముప్పిడి లక్ష్మి, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, బంక అప్పారావు, ముప్పిడి వెంకటరత్నం, వివిధ శాఖల అధికారులతో పాటు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ వర్గ కుమ్ములాటలో ఒకరికి గాయాలు



దేవరపల్లిలో ఎన్టీఆర్ సాక్షిగా నడిరోడ్డుపై కొట్టుకుంటున్న టీడీపీ నాయకులు

- గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలింపు
- పార్టీ ఆవిర్భావ వేడుకల్లో భగ్గుమన్న విభేదాలు



కొట్లాటలో గాయపడిన పాతూరి గిరిధర్

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గంలో టీడీపీ వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. ఇక్కడ జరిగిన కుమ్ములాటలో గౌరీపట్నంకు చెందిన ఓ వ్యక్తికి బలమైన గాయాలయ్యాయి. టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం దేవరపల్లి బస్టాండ్ సెంటర్ వద్ద మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు వర్గానికి చెందిన గ్రామ కమిటీ అధ్యక్షుడు గద్దే సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు వర్గానికి చెందిన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అంద్రు అనిల్ ఆధ్వర్యంలో కొందరు అక్కడకు చేరుకున్నారు. అంతకు ముందున్న పార్టీ పతాకాన్ని తొలగించి మరలా ఆవిష్కరించడానికి యత్నించారు. దీంతో ముప్పిడి వర్గానికి చెందిన యాగంటి సాయిబాబు, మరికొందరు అడ్డుకున్నారు. రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఒకరినొకరు నెట్టుకోవడం, తోపులాట, అరుపులతో సెంటర్ దద్దరిల్లింది. సమీపంలోని జ్యూస్ షాపులోని ప్లాస్టిక్ బకెట్, మిక్సీ జార్‌ను విసరడంతో గౌరీపట్నంకు చెందిన పాతూరి గిరిధర్ తలకు బలమైన గాయమైంది. అతడ్ని గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గంటపాటు వివాదం జరిగింది. పోలీసులు చేరుకుని ఇరువర్గాల నాయకులను సముదాయించి పంపించారు.

అనధికార కుళాయి కనెక్షన్లు గుర్తించండి

- స్వచ్ఛందంగా ముందుకు వచ్చి క్రమబద్ధీకరించుకునే అవకాశం
- మునిసిపల్ చైర్ పర్సన్ రత్నకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు: పురపాలక సంఘ పరిధిలో అనధికారికంగా కుళాయిలు తీసుకుని వినియోగించుకుంటున్న లబ్ధిదారులు స్వచ్ఛందంగా వచ్చి వాటికి క్రమబద్ధీకరించుకోవాలని చైర్‌పర్సన్ భావన రత్నకుమారి సూచించారు. పట్టణంలో అక్రమ కుళాయి కనెక్షన్‌లు భారీగా పెరిగాయన్నారు. దీనిపై ఇటీవల అనేక ప్రాంతాల నుంచి తనకు ఫిర్యాదులు కూడా అందాయన్నారు.ఈ నేపథ్యంలో సచివాలయ పరిపాలన సెక్రటరీలతో చైర్‌పర్సన్ రత్నకుమారి బుధవారం మునిసిపల్ ఆఫీసులోని తన చాంబర్‌లో సమీక్ష జరిపారు. క్షేత్ర స్థాయిలో సర్వే చేయించి అక్రమ కుళాయిల లెక్క తేల్చాలని సూచించారు.దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న లబ్ధిదారులు రూ.200 తోపాటు అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇతరులు రూ.4,500తో పాటు అపరాధ రుసుం చెల్లించాలన్నారు.అక్రమ కుళాయిల వల్ల పురపాలక సంఘానికి వచ్చే ఆదాయాన్ని కోల్పోతున్నామన్నారు. కుళాయిలు అనధికారికంగా వినియోగించుకుంటున్న వారు క్రమబద్ధీకరణకు ముందు రాకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.క్షేత్ర స్థాయిలో అనధికారిక కుళాయిలను గుర్తించి పురపాలక సంఘం దృష్టికి తీసుకుని రావాలని సిబ్బందిని చైర్‌పర్సన్ ఆదేశించారు. మేనేజర్ జి.రాధాకృష్ణ, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చాగల్లు: మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో బి.రాంప్రసాద్ తెలిపారు. చాగల్లులో 2, చిక్కాలలో 2, మార్కొండపాడులో ఒక పోస్టుకు అర్హులైన అభ్యర్థులు ఏప్రిల్ 1 నుంచి 4లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఆయా గ్రామ పంచాయతీలో పరిధిలోని వారై 10 వ తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తుదారులకు వచ్చే నెల 10న ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఎంపీడీవో తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

గోపాలపురం: మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన జుట్టా నాగేశ్వరరావు (30) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గోపాలపురం ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం నాగేశ్వరరావు మద్యానికి అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో అతడు మూడు రోజుల క్రితం తన భార్యతో గొడవపడ్డాడు. ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ఈ నెల 26న ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ ఇంటి నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వచ్చి తలుపులు తెరిచి చూస్తే నాగేశ్వరరావు మృతదేహం లభ్యమైంది. బుధవారం కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

సారా కేసుల్లో ఇరువురి బైండోవర్

కొవ్వూరు: సారా కేసుల్లో నిందితులైన ఇరువురిని బుధవారం చాగల్లు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్టు ఎస్‌ఈబీ కొవ్వూరు ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. చాగల్లు మండలం చిక్కాలకు చెందిన కాసాని కోట సత్యనారాయణ, చాగల్లుకు చెందిన కండిబోయిన గణపతిలను బైండోవర్ చేసినట్టు చెప్పారు

పారదర్శకంగా ఉపాధి పనులు చేపట్టాలి



ఫీల్డ్‌అసిస్టెంట్లతో మాట్లాడుతున్న డ్వామా పీడీ రామ్‌గోపాల్, ఎంపీపీ భాగ్యలక్ష్మి

నిడదవోలు రూరల్: ఉపాధి హామీ పనులను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.రామ్‌గోపాల్ సూచించారు. సమిశ్రగూడెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదికను ఎంపీపీ భాగ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ రామ్‌గోపాల్ మాట్లాడుతూ నిడదవోలు మండలంలోని 23 గ్రామాల్లో ఉపాధిహామీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఫారెస్ట్, సర్వశిక్ష అభియాన్ ద్వారా 1093 పనులను రూ.12.04 కోట్లు ఖర్చుచేశారన్నారు. వీటిపై సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించగా ప్రధానంగా పని ప్రదేశాల్లో నేమ్ బోర్డులు లేకపోవడాన్ని గుర్తించారన్నారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆయన సూచించారు. ఎంపీడీఓ టి.మూర్తిబాబు, ఏపీఓ ఏవీ రామారావు, పంచాయతీరాజ్ ఏఈ సీహెచ్‌ఆర్‌కేఎస్ శాస్త్రి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆపద మిత్ర అవార్డు గ్రహీత కిరణ్‌కు సన్మానం



కిరణ్ బాబును సత్కరిస్తున్న ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: సచివాలయ వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న ముక్కామలకు చెందిన గెద్దం కిరణ్ బాబు రాష్ట్రస్థాయి ఆపద మిత్ర అవార్డు గెలుచుకున్నారు. దాంతో పాటు ఆయనకు రాష్ట్ర ఉత్తమ సోషల్ మ్యాపింగ్ అవార్డు కూడా దక్కింది. ఈ క్రమంలో మండలంలోని కాపవరంలో మంగళవారం నిర్వహించిన ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కిరణ్‌బాబును రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు తమ ప్రసంగాల్లో కిరణ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, ముక్కామల సర్పంచ్ కేతా త్రిమూర్తులు, ఎంపీటీసీ సభ్యుడు గండేపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాతాలు కుటుంబానికి నాగబాబు పరామర్శ

ఉండ్రాజవరం: జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీ కోసం చేసిన నార్ని తాతాలు ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు కొణిదెల నాగేంద్రబాబు బుధవారం మండలంలోని కె.సావరం వచ్చారు. తాతాలు కుమారుడైన కె.సావరం సర్పంచ్ నార్ని రామకృష్ణను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా తాతాలు చిత్ర పటానికి నాగబాబు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ ఆవిర్భావ వేడుకల్లో వేరు కుంపట్లు

కొవ్వూరు: తెలుగుదేశం పార్టీ 41వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం కొవ్వూరు నియోజకవర్గంలోని ఆ పార్టీ వర్గాలు రెండు గ్రూపులుగా నిర్వహించాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడైన మాజీ మంత్రి కేఎస్ జవహర్ పట్టణంలోని స్వగృహం వద్ద తన అనుచరులతో కలసి కేక్ కట్ చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం వారు మెయిన్ రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ నాయకుల మధ్య ఎనిమిదేళ్లుగా నెలకొన్న విభేదాల వలల ఆ పార్టీ గ్రూపులుగా పనిచేస్తోంది. ఇప్పుడు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని సైతం పట్టణంలోనే వేర్వేరు చోట్ల విడివిడి నిర్వహించడాన్ని కార్యకర్తలు జీర్ణించుకోలేక పోతున్నారు. మరో ఏడాదిలో ఎన్నిక లు సమీపిస్తున్న తరుణంలో పార్టీ నేతల మధ్య సఖ్యత లేకపోవడం పార్టీ శ్రేణులను అయోమయానికి గురి చేస్తోంది.

ఎన్నికల్లో తప్పుడు నివేదికలు సమర్పించారు

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం పంచాయతీ సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు గత ఎన్నికలపుడు తప్పుడు నివేదికలు సమర్పించి అధికారులను మోసగించగడమే గాకుండా, అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కై గాల శ్రీనివాసరావు ఆరోపించారు. పరశు రామారావు సర్పంచ్ పదవి నుంచి వైదొలగాలని కై గాల డిమాండ్ చేశారు. శ్రీనివాసరావు మంగళవారం సర్పంచ్‌పై పలు ఆరోపణలు చేశారు. 2021 ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు. సర్పంచ్ పనితీరుపై గ్రామానికి చెందిన కురసాల సతీష్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేశారన్నారు. దీనిపై సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు మాట్లాడుతూ పదవిలో ఉన్న వారిపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేయడం సహజం అన్నారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న తమపై కోర్టులో చేసిన ఫిర్యాదులపై కోర్టులోనే వివరణ ఇస్తామన్నారు. అసత్య ఆరోపణలు చేయడం టీడీపీ నాయకులకు తగదన్నారు.